ప్రజాశక్తి
బుధవారం 22 మార్చి 2023 5
పార్వతీపురం మన్యం



5న 'చలో ఢిల్లీ' జయప్రదం చేయండి

సీతానగరం : కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మధరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో చలో ఢిల్లీ కరపత్రాలను గ్రీన్ అంబాసిడర్లతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం కార్మికులు, రైతులు, ప్రజా సమస్యలను మరింత జటిలం చేస్తుందని, వీటిని వారి కోర్కెలను ఆమోదించకుండా, అత్యంత ధనవంతులైన అదాని, అంబానీ వంటి వారి సేవలో మునిగి తేలుతుందని విమర్శించారు. రాజ్యాంగం ప్రసాదించిన కనీస ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ, మతం పేరుతో ప్రజలను విడగొట్టి పరిపాలిస్తుందని అన్నారు. ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టామని, ఇందులో కార్మిక, కర్షక, ఉద్యోగులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి జి.వెంకటరమణ పాల్గొన్నారు.

ఆరుగాలం అన్నదాత కష్టపడి పండించిన పంట అకాల వర్షాలకు నీటిపాలైంది. జిల్లాలో గత నాలుగు రోజులుగా ఈదురుగాలులు, వర్షాలు కురుస్తున్నాయి. ఏరో నెల రోజుల్లో చేతికొచ్చిన పంట గాలులకు నేలపాలవ్వడంతో రైతులు కన్నీరుమున్నీరవుతున్నారు. జిల్లాలో 750 ఎకరాల్లో అరటి పంట నష్టానికి గురైనట్లు ఉద్యానవన శాఖ అధికారులు తెలిపారు. వేలాది ఎకరాల్లో మొక్కజొన్న పంట నేలకొరిగింది. ఎక్కువగా జియ్యమ్మవలస, కురుపాం, వీరఘట్టం, కొమరాడ, మక్కువ, పాచిపెంట మండలాల్లో పంట నష్టం జరిగినట్టు అధికారులు గుర్తించారు.

కురుపాంలో నేలకొరిగిన మొక్కజొన్న



ఎకరాలకు రూ.50వేలు చొప్పన నష్టపరిహారం చెల్లించాలి

అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.50వేలు చొప్పున నష్టపరిహారం చెల్లించాలి. పంట నష్టం అంచనా వేసే సమయంలో వ్యవసాయ అధికారులు రెవెన్యూ సిబ్బందితో పాటుగా రైతులను కూడా వెంట తీసుకువెళ్లి వారి సమక్షంలోనే ఎంత విస్తీర్ణంలో ఏఏ రైతు పంట ఎంత నష్టపో యిందో గుర్తించాలి. అలాగే కౌలు రైతులకు నష్టపరి హారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలి.

బంటు దాసు,
జిల్లా సహాధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం.

అకాల వర్షాలు... అపార నష్టం

- వేలాది ఎకరాల్లో అరటి, మొక్కజొన్న నేలపాలు
- నష్టాల పాలైన అన్నదాత

ప్రజాశక్తి - కురుపాం/వీరఘట్టం/జియ్యమ్మవలస/మక్కువ

కురుపాం : మండలంలోని పుతికవలస, శివన్నపేట, కిచ్చాడ గ్రామాల పరిధిలో అరటి పంట 50 ఎకరాలు, మొక్కజొన్న 30 ఎకరాలు నష్టపోయినట్లు అధికారులు అంచనా వేశారు. ఎక్కువగా నష్టం జరిగింది అరటి పంటని, లేత దశలో ఉన్న సమయంలో పంట పూర్తిగా నేల మట్టం కావడంతో ఎందుకూ పనికి రాకుండా పోయింది. మొక్కజొన్న చేలు కూడా నష్టపోయాయి. ఎకరాకు లక్ష ఖర్చు అయినా, రూ.40వేలు మిగిలుతాయని రైతులు తెలిపారు. ఎకరాకు ఇప్పటి వరకు రూ.60వేలు ఖర్చు చేశారు. పంట చేతికి వస్తాదన్న సమయంలో వర్షాలకు పాలుపోసుకున్న కంకులతో సహా మొక్క జొన్న నేల మట్టమయ్యిందని రైతులు వాపోతున్నారు. వివిధ దశలో ఉన్న అరటి తోటలు కూడా నష్టపోయాయి.

జియ్యమ్మవలస : మండలంలోని పెదమేరంగి, గౌరమ్మపేట, బిత్రపాడు, బాసంగి, చింతల బెలగాం, కుదమ, పరజపాడు, కన్నపుదొరవలస, కుందలతిరువాడ పంచాయతీల్లో ఎక్కువగా రైతులు అరటిపంట సాగు చేస్తున్నారు. మండలంలో ప్రస్తుతం 7 వేల ఎకరాల్లో అరటి పంట సాగువుతుంది. అధికారుల లెక్కల ప్రకారం 420ఎకరాల్లో నష్టం జరిగినట్టు చెబుతున్నారు. పంట నష్టంపై పూర్తిస్థాయిలో పరిశీలన జరిపి అంచనాలు రూపొందించాల్సి ఉందని అధికారులు తెలిపారు. అయితే పూర్తిగా దెబ్బతిన్న పంటనే అధికారులు పరిశీలిస్తున్నారని, పాక్షికంగా దెబ్బతిన్న పొలాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వీరఘట్టం : ఇటీవల వీచిన గాలులకు మండలంలోని నడుకూరు, కంబర వలస, కంబర , కిమ్మి, చిటిపూడి వలస గ్రామాల్లో సుమారు 100 ఎకరాల్లో అరటి పంట నష్టం వాటిలినట్లు ఉద్యానవన శాఖ అధికారులు మంగళవారం తెలిపారు. పంట చేతికి వచ్చే తరుణంలో అకాల వర్షంతో పాటు పెనుగాలులో పంట తీవ్రంగా దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు సుమారు రూ.60 వేలు పెట్టుబడులు పెట్టినట్లు రైతులు చెబుతున్నారు. అలాగే పివిఆర్‌పురం, బిటి వాడ గ్రామాల్లో మొక్క జొన్న కూడా నాశనమైందని రైతులు తెలిపారు.

మక్కువ మండలంలోని మొక్కజొన్న పంట దెబ్బతింది. ఇటీవల కురిసిన వర్షాలతో జొన్న పిక్కలు, అలాగే పిక్కల తీయకుండా ఉంచిన జొన్న పొత్తులు కూడా తడిసిపోవడంతో రోడ్ల పైన పంటఎండబెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. సకాలంలో కొనుగోలు కాకపోతే జొన్నలు రంగు మారి ముక్కిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు.



జియ్యమ్మవలసలో అరటి పంట నష్టాన్ని అంచనా వేస్తున్న సచివాలయ సిబ్బంది

పంటనష్టం వేస్తున్నాం

జిల్లాలో ఎక్కువగా జియ్యమ్మవలస, కురుపాం, వీరఘట్టం, కొమరాడ, మక్కువ, పాచిపెంట మండలాల్లో పంటనష్టం జరిగింది. అరటి పంటలు అమ్ముకోవడానికి పంట సిద్ధంగా ఉంటే రైతులు వెంటనే అమ్ముకోవచ్చు. పక్వానికి రాని పంట ఉంటే తమ శాఖ సిబ్బంది వచ్చి తనిఖీ చేసిన తర్వాత నష్టపోయిన పంటలో 33శాతం అమ్మకానికి పనికిరాని పంటగా గుర్తిస్తే రైతుకు బీమా వర్తిస్తుంది. ఎకరాకు రూ.10వేలు చొప్పున బీమా సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తోంది.

కె.సత్యనారాయణ రెడ్డి,
జిల్లా ఉద్యానశాఖ అధికారి



డిఎంహెచ్ఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు, సిఐటియు నాయకులు

కనీస వేతనాల కోసం..

ఆశాల ధర్నా

గుర్తింపు కార్డులివ్వాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం ఎదుట ఆశా వర్కర్లు ధర్నా చేశారు. ధర్నానుద్దేశించి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి. ఇందిర మాట్లాడుతూ ఆశా వర్కర్ల నియామకం ప్రభుత్వం ద్వారానే జరగాలని, పని భారాన్ని తగ్గించాలని, ప్రభుత్వ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. శానిటేషన్ కమిటీల ద్వారా నియామకాలు జరపడం ద్వారా రాజకీయ నాయకుల ప్రాబల్యం పెరిగిందని, కష్టపడి పని చేసే వారిని తొలగించి వారి స్థానంలో అధికార పార్టీ అనుయాయులు నియమిస్తున్నారని ఇది చాలా దుర్మార్గమని విమర్శించారు. విలేజ్ హెల్త్ క్లినిక్, సచివాలయాల డ్యూటీ ఆశ వర్కర్లతో చేయించరాదని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ఇమాండ్ చేశారు. 104 ఉద్యోగుల కోసం ఆశా వర్కర్లతో ఎలాంటి అదనపు ఖర్చులు చేయించరాదని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కోశాధికారి జి.వెంకటరమణ మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పనిచేసే ఫోన్లు ఇవ్వాలని, రిటర్మెంట్ బెనిఫిట్స్ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశలుగా మార్చుకోవాలని, జిల్లా ఆస్పత్రిలో ఆశాలకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని, ఎన్.సి.డిఆర్ సర్వే, కిట్లు పంపిణీని నుంచి మినహాయించాలని కోరారు. ఆశాలందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. అనంతరం డిఎంహెచ్ఒకు వినతిని అందజేశారు. దీనికి ఆయన స్పందిస్తూ తన పరిధిలో ఉన్న స్థానిక సమస్యలన్నీ వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు ఎం.శివాని, లక్ష్మి, భాగ్యలక్ష్మి, శైలజ, జ్యోతి, నారాయణమ్మ , ఆర్.లక్ష్మి, పలువురు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగాది శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్

పార్వతీపురం : : జిల్లా ప్రజలకు శోభ కృత్ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలను జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళ వారం ఒక ప్రకటన జారీ చేశారు. శుభ కృత్ నామ సంవత్సరంలో పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడి శోభ కృత్ నామ సంవత్సరంలోకి ప్రవేశించిందని అన్నారు. శుభ కృత్ నామ సంవత్సరంలో జిల్లా ప్రగతి దిశగా నడిచిందని, శోభ కృత్ నామ సంవత్సరంలో మరింత ప్రగతి దిశగా అడుగులు వేయాలని ఆయన ఆకాక్షించారు. జిల్లా ప్రజలు శోభ కృత్ నామ సంవత్సరంలో మరింత సుఖ శాంతులతో ఉండాలని, ప్రతి ఇంటా ఆర్థిక స్వావలంబన కలగాలని ఆయన కోరారు.



పెద్దఖర్జలో రైతుల వద్ద ఉన్న ధాన్యం బస్తాలు

నేటికీ ఇళ్ల వద్దే ధాన్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అన్నదాత ఆరు గాలం కష్టించి పండించిన ధాన్యం ప్రభుత్వం నేటికీ కొనుగోలు చేయక పోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని ఇరిడి రైతు భరోసా కేంద్రం పరిధిలో గల పెద ఖర్జ, సప్ప గూడ, బొద్దిడి గ్రామాల్లో రైతులు పండించిన ధాన్యం నేటికి ఇళ్ల వద్దనే దర్శనం ఇస్తున్నాయి. ధాన్యం కొనుగోలు చేస్తామని డిసెంబర్‌లో గోనె సంచులు ఇచ్చిన అధికారులు నేటికీ కొనుగోలు చేయలేదని రైతు లు పల్లెరిక బారికి మండంగిబలరాం, తోయక ధర్మారావు, సన్యాసి రావు తెలిపారు. దీంతో ఎలుకలు, చేదలు పట్టి పాడైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలని వారు కోరుతున్నారు.

విద్యార్థులకు రాగిజావ పంపిణీ

ప్రజాశక్తి - కలెక్టరేట్

విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం రాష్ట్ర ముఖ్య మంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి తన క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభించి వర్చువల్ విధానంలో ప్రసారం చేశారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్‌లో కలెక్టర్ నిశాంత్ కుమార్ వీడియో కాన్ఫరెన్స్‌లో విద్యార్థులతో కలిసి పాల్గొన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని 71,279 మంది విద్యార్థులకు ఈ కార్యక్రమం వల్ల ప్రయోజనం కలుగుతుంది. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ రాగి జావ చక్కని పోషక ఆహారమని, విద్యార్థులు పౌష్ఠికాహారం తీసుకోవాలని తద్వారా ఆరోగ్యంగా ఉండి చదువుపై దృష్టి సారించగలరని పేర్కొన్నారు. పరీక్షల సమయంలో మంచి ఆహారానికి మరింత ప్రాధాన్యత ఉండాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, అవకాశాలు అందిపుచ్చుకోవాలని తల్లిదండ్రుల కలలు నిజం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డిఇఒ డాక్టర్ ఎస్.డి.వి.రమణ, డిప్యూటీ డిఇఒ పి.బ్రహ్మాజీరావు, విద్యాశాఖ అధికారులు, ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బలిజిపేట : మండలంలోని వెంగాపురం మండల పరిషత్ పాఠశాలలో స్థానిక సర్పంచ్, గులిపల్లి అమ్మడమ్మ ఎంపిటిసి సభ్యులు మురళి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింహాద్రినాయుడు, సిబ్బంది పకీర్ నాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

కురుపాం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు టి. శంకరరావు ఆధ్వర్యంలో జరిగిన జగనన్న గోరుముద్ద లో భాగంగా విద్యార్థులకు రాగి మాల్ట్‌ను ఎంపిపి శెట్టి పద్మావతి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికమైన ఆహారం అందించడమే లక్ష్యంగా మంగళ, గురు, శనివారాల్లో ప్రోటీన్స్ విటమిన్స్ తో కూడిన రాగిమాల్టను అందజేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత, సర్పంచ్ జి. సుజాత, ఉప సర్పంచ్ షేక్ ఆదిల్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ జిలాని, ఎంపిటిసి సభ్యులు వి. బంగారనాయుడు, టీవీఎస్ స్వామియోజులు, సిఆర్‌పి నరేష్, పాఠశాల విద్యా కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు రాగిజావ పంపిణీలో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, డిఇఒ

పాలకొండ: ప్రాథమిక ఉన్నత పాఠశాల లో జగనన్న గోరుముద్ద లో భాగంగా మరో పోషకహారం అయిన రాగి జావను విద్యా కమిటీ చైర్మన్ గురుబిల్లి రవికుమార్ లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూర్యనారాయణ, సలహాదారుల కమిటీ సభ్యులు గోవిందరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎల్విన్ పేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, చింతలగూడ ఎయిడెడ్ పాఠశాలల్లో విద్యార్థులకు రాగిజావ పంపిణీ జరిగింది. ఈ సందర్భంగా గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్ పేట సర్పంచులు బొత్తాడ గౌరీ శంకర రావు, ఆర్ చైతన్య స్రవంతి, వైస్ ఎంపిపి నిమ్మక శేఖర్ మాట్లాడుతూ రాగిజావలో ఎన్నో పోషక పదార్థాలు ఉంటాయని, విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో మంచిదని అన్నారు. మూలిగూడ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో పేరెంట్స్ కమిటీ చైర్మన్ మండంగి భాస్కరరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కిషోర్ కుమార్, పాఠశాల మేనేజర్ బి.కృష్ణ నాయుడు, హెచ్ఎం సామల సింహాచలం, పంచాయతీ కార్యదర్శి శ్యామల, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీతానగరం: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జెడ్‌పిటిసిసభ్యులు ఎం.బాబ్జీ, ఎంపిపి బి.రమణమ్మ, నాయకులు శ్రీరాములునాయుడు విద్యార్థులకు రాగి జావ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం అందించే దిశగా రాగి జావను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ జి.సూర్యదేముడు, ఇన్చార్జి ఎంపిడిఒ ఎంఎస్ఎన్ఎల్ ప్రసాద్, హెచ్ఎం ఇల్లా ప్రసన్న లక్ష్మీ, ఎంపిటిసి సభ్యులు ఎస్.గౌరి, బి.కుసుమ సూర్యనారాయణ, వైసిపా నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సాలూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రాగి జావను ఎంఇఒ బి.రాజ్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాగిజావలో మంచి పోషక విలువలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని జడ్పిటిసి జంపు కన్నతల్లి, ఉమామహేశ్వరరావు ప్రారంభించారు. కార్యక్రమంలోఎంఇఒ కృష్ణమూర్తి, వైస్ ఎంపిపి పి.విజయకుమారి, ప్రధానోపాధ్యాయులు డి.నాగమణి, సిబ్బంది ఉన్నారు. అలాగే మండల వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

మక్కువ : స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జెడ్పిటిసి సభ్యులు మావుడి శ్రీనివాసరావు రాగిజావ పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సూర్యనారాయణ, ఎంపిడిఒ దేవకుమార్, ఎంఇఒ మల్లేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీతానగరం : విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేస్తున్న ఎంపిపి, జెడ్‌పిటిసి

పరీక్షా కేంద్రాన్ని సబ్ కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

మండలంలోని చినమేరంగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలను సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ మంగళవారం తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాన్ని ఆయన క్షుణ్ణంగా పరిశీలించి సిఎస్ శివప్రసాద్‌తో పరీక్షల నిర్వహణపై చర్చించారు. ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 567 మంది హాజరు కావాల్సి ఉండగా 40 మంది విద్యార్థులు గైర్హాజర్ అయ్యారని సిఎస్ తెలిపారు. జనరల్, ఒకేషనల్ కోర్స్ విద్యార్థులు పరీక్షలు రాశారని అన్నారు.

కురుపాం : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఆకస్మికంగా సందర్శించారు. ప్రతి గదికి వెళ్లి విద్యార్థులు పరీక్ష రాస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఫ్లేయింగ్ స్కేడ్ హరి రమణారావు, తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, పరీక్ష నిర్వహణ అధికారి ఎం.హరికృష్ణ, ఆర్ఐ పిఎల్‌వి ప్రసాద్ పాల్గొన్నారు.


విద్యార్థుల విద్యా పర్యటన

విజయనగరం : విద్యా పర్యటనకు వెళ్లిన జిల్లా విద్యార్థులు ప్రధాని మోడీని మర్యాద పూర్వకంగా కలిశారు. సాంఘిక సంక్షేమ శాఖ వసతిగృహాల్లో 8, 9వ తరగతులు చదువుతున్న 15 మంది విద్యార్థులను విద్యా పర్యటనకు బ్యాంక్ ఆఫ్ ఇండియా సహకారంతో ఈ నెల 16 నుంచి తీసుకెళ్లారు. అందులో భాగంగా ఢిల్లీలో పార్లమెంట్, నాణేల తయారీ కేంద్రం, ఇండియా గేట్‌ను సందర్శించారు. ప్రధాని మోడీని మర్యాదపూర్వకంగా కలిశారు. విద్యార్థుల సంరక్షణ నిమిత్తం వార్డెన్లు భాస్కరరావు, గౌరిలక్ష్మి, ఆఫీస్ పర్యవేక్షకులు కె.ఆదినారాయణ కూడా పర్యటనకు వెళ్లారు.

ఆలోచనలకు ప్రతిరూపం శాస్త్రీయ ప్రదర్శనలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

విద్యార్థుల అద్భుత ఆలోచనలకు ప్రతిరూపం శాస్త్రీయ ప్రదర్శనలు అని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్‌డివి రమణ అన్నారు. వ్యవస్థాపక మనస్తత్వ అభివృద్ధి కార్యక్రమం జిల్లాస్థాయి ఎక్స్పో-2023 స్థానిక డిఇఒ కార్యాలయ ఆవరణలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థుల ప్రాజెక్టుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులకు సంబంధించి సమాచారాన్ని అడిగి తెలుసుకోవడమే కాకుండా ప్రశ్నలు వేసి విద్యార్థుల ఆలోచనా విధానాన్ని పరిశీలించారు. విద్యార్థులు అద్భుతమైన ఆలోచనలతో పారిశ్రామిక రంగంలో వినూత్న ఆవిష్కరణలు తీర్చిదిద్దడానికి ఉపకరిస్తాయన్నారు. విద్యార్థులలో దాగివున్న నైపుణ్యాలను వెలికితీయడానికి ఇటువంటి ఎక్స్పోలు తోడ్పడతాయని అన్నారు. జిల్లాలో 140 పాఠశాలల నుంచి 140 ప్రాజెక్టులు రాగా, వివిధ స్థాయిలలో పరిశీలించి జిల్లా స్థాయిలో 10 ప్రాజెక్టులను ఎంపిక చేసి ప్రదర్శించారు. మొదటి రెండు స్థానాలలో నిలిచిన ప్రాజెక్టులను ఈ నెల 28న విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయికి పంపించనున్నారు. డిప్యూటీ డిఇఒ పి.బ్రహ్మాజీ రావు మాట్లాడుతూ విద్యార్థులు మంచి ప్రాజెక్టులు చేయడం ఆలోచన శక్తికి నిదర్శనం అని కొనియాడారు. విద్యార్థులకు మార్గదర్శత్వం వహించిన ఉపాధ్యాయులను అభినందించారు. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రాజేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు మంచి ఆలోచనతో చేసిన ఇటువంటి ప్రాజెక్టులు జిల్లా స్థాయిలో మరిన్ని రావాలని కోరారు. డిసిబి సెక్రటరీ పిసిహెచ్ శ్రీనివాస రావు మాట్లాడుతూ ఇటువంటి ఎక్స్పోలో జ్యూరీ మెంబర్ కమిటీలో ఉన్నందుకు సంతోషం వ్యక్తం చేస్తూ పోటా పోటీగా పడిన ఈ ప్రాజెక్టులు వినూత్నమైనవని అభివర్ణించారు. కార్యక్రమంలో ఇఎండిపి ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అనూష, జిల్లా సైన్స్ అధికారి జి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రాజెక్టుల వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకుంటున్న డిఇఒ రమణ

'అప్పారి' ఆశయాలను సాధిద్దాం

ప్రజాశక్తి -కలెక్టరేట్

యుటిఎఫ్ నిర్మాత అప్పారి వెంకటస్వామి ఆశయాలను ఉపాధ్యాయులంతా సాధించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో యుటిఎఫ్ జిల్లాశాఖ ఆధ్వర్యాన వెంకటస్వామి వర్థంతి సభ జరిగింది. తొలుత ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం మురళీమోహనరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల హక్కుల కోసం 1974లో యుటిఎఫ్‌ను ఏర్పాటు చేశారన్నారు. ఉపాధ్యాయులకు ఎన్నో హక్కులు, రాయితీలు సాధించిన ఘనత అప్పారిదేనన్నారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు టి.రమేష్ మాట్లాడుతూ అప్పారావు ఆశయాలను యుటిఎఫ్ కొన సాగిస్తుందని, అందుకే ఈ రోజు రాష్ట్రంలో అతిపెద్ద సంఘంగా ఉందని అన్నారు. అప్పారి స్ఫూర్తితో ఈ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని అన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ట్రెజరర్ కె.మురళి, జిల్లా కార్యదర్శులు భాస్కరరావు, శ్రీనివాసరావు, వెంకటి నాయుడు మండల నాయకులు పట్టణ నాయకులు పాల్గొన్నారు.



వెంకటస్వామి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న యుటిఎఫ్ నాయకులు


టేకు మొక్కలకు నెంబర్లు వేయిస్తున్న డిఎఫ్ఒ

కలప తరలిస్తే కఠిన చర్యలు

సాలూరురూరల్ : రిజర్వ్ ఫారెస్ట్ లో ఉండే ప్రభుత్వానికి సంబంధించిన కలపను ఎవరైనా దొంగిలించినా, నరికినా అటువంటి వారిపై కఠిన చర్యలు ఉంటాయని డిఎఫ్ఒ. జి.ఎ.ప్రసూన హెచ్చరించారు. మంగళవారం ఆమె మండలంలోని కురుకుట్టి దండిగాం రిజర్వ్ ఫారెస్ట్ టేకు వనంలో విరిగిపోయిన చెట్లను గుర్తించి వాటికి నెంబర్లు వేశారు. వీటిని త్వరలో కటింగ్ చేసి వేలానికి తరలిస్తామని తెలిపారు. ఆమె వెంట సాలూరు రేంజ్ ఆఫీసర్ కె.రామారావు, సెక్షన్ ఆఫీసర్ దేవరాజు, బీటు ఆఫీసర్ సుధాకర్, సన్యాసి రావు పాల్గొన్నారు.


రోడ్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగారావు

రోడ్ల అభివృద్ధికి అంచనాలు సిద్ధం చేయండి

పార్వతీపురం టౌన్ : మున్సిపాల్టీ పరిధిలో పలు రహదారులను ఆధునికరించేందుకు ప్రణాళిక విసిద్ధం చేయాలని స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆర్ అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే ఆయా శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలించారు. ఈ పరిశీలనలో భాగంగా జిల్లా కేంద్రంలో గల ప్రభుత్వ ఆసుపత్రి ప్రధాన రహదారి, మైదానం వీధి రహదారి, ప్రభుత్వ జూనియర్ కళాశాల రహదారితో పాటు చర్చివీది మీదుగా జనశక్తి కాలనీ వరకు గల అంతర్గత సిసి రోడ్లను ఆధునీకరించేందుకు అవసరమైన ప్రతిపాదనలను సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించాలని ఆయా రహదారులను పునర్నిర్మాణం చేపట్టి ఆధునికరించేందుకు అవసరమైన ప్రణాళికలను రచించి అందజేయాలని సంబంధిత ప్రభుత్వ శాఖలను ఆదేశించారు. అంచనాలను రూపొందించి అనుకున్న గడువు లోపు నివేదికలను అందజేస్తామని ఆర్ అండ్ బి శాఖ అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ పరిశీలనలో జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ వి వాగ్దేవి, ఆర్ అండ్ బి ఇఇ ఎం.జేమ్స్, డిఇ ఎ.అప్పాజీ, ఎఇలు రాజేంద్ర కుమార్, బి ప్రమీల, పిఆర్ డిఇ రత్నాకర్, పార్టీ పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు బొంగు చిట్టి రాజు, వైసీపీ నాయకులు బోను ఆదినారాయణ, పోల ఈశ్వర నారాయణ, ఎస్ శ్రీనివాసరావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన

సీతంపేట : మండలంలోని దిగువకారిమానుగూడలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఎంపిడిఒ ఎంపిడిఒ కె.గీతాంజలి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోజుకు రూ.257 కూలి వచ్చేలా కొలతలు ఇవ్వాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. పని ప్రదేశాల్లో తాగునీరు, టెంట్లు ఉండడంతో సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సీతంపేటలో జరిగిన ఆధార్ క్యాంపును ఆమె పరిశీలించారు. సీతంపేట, ధారపాడు, గోయిది, కుడ్డపల్లి, కిల్లాడ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఆధార్ అప్డేట్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆమె వెంట ఎపిఒ సాగర్ ఉన్నారు.

ఉపాధ్యాయులకు ఘనసన్మానం

పాలకొండ : పట్టణంలో పెదకాపువీధి జిల్లా పరిషత్ పాఠశాలలో పదోన్నతిపై వెళ్తున్న ఉపాధ్యాయులకు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా 17వ వార్డు కౌన్సిలర్ దుప్పాడ పాపినాయుడు మాట్లాడుతూ ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. విద్యార్థులు చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జామి రవి, ఎస్ఎంసి కమిటీ చైర్మన్ రోజా, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ అటవీ దినోత్సవం

పాలకొండ రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీకళాశాలలో మంగళవారం డిపార్ట్‌మెంట్ ఆఫ్ బోటనీ, ఇకో-క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ అటవీ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ జనార్ధన్‌నాయుడు అధ్యక్షత వహించగా పాలకొండ డివిజన్ ఫారెస్టు రేంజ్ అధికారి కె.తవిటినాయుడు ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడుతూ మన్యం జిల్లాలో పులి సంచారం, ఏనుగుల దాడి, ఫారెస్టు అధికారిగా ఎదురయ్యే సవాళ్లు, కాంపిటేటివ్ పరీక్షలపై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అంతకు ముందు విద్యార్థులకు అడవులు, ఆరోగ్యం అనే అంశంపై నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో బోటనీ విభాగాధిపతి వి.జనార్ధనరావు,ఐక్యూఎసి కో-ఆర్డినేటర్, ఉపేంద్రరావు, జల్లు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన పంటలను అంచనా వేయాలి

కొమరాడ : గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన పంటలను అంచనా వేసి పరిహారం అందించాలని టిడిపి అరకు పార్లమెంటరీ రైతు అధ్యక్షులు దేవకోటి వెంకటనాయుడు అన్నారు. మంగళవారం మార్కొండపుట్టి, కొమరాడలో దెబ్బతిన్న అరటి పంటను పరిశీలించారు. వర్షాలకు, ఈదురుగాలకు నష్టపోయిన పంటలను వ్యవసాయ అధికారులు తక్షణమే అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపాలని కోరారు.

పిహెచ్‌సిలో సదుపాయాలు కల్పించాలి

కొమరాడ : స్థానిక పిహెచ్‌సిలోకనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం పిహెచ్‌సిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మౌలిక వసతుల్లేవని, దీంతో రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారన్నారు. మంచినీరు కోసం ఏర్పాటు చేసి ఫిల్టర్ పనిచేయడంలేదని, ఇన్వర్టర్ మరమ్మతులకు గురైందని తెలిపారు. అలాగే రోగులకు వివిధ రక్త పరీక్షలు చేసేందుకు పరికరాలు లేవన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిహెచ్‌సిలో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలని డిమాండ్ చేశారు.

మొక్కలు మనిషి మనుగడకు ఆధారం

సాలూరురూరల్ : మొక్కలు మానవుని మనుగడకు ఆధారమని మండలంలోని మామిడిపల్లి సర్పంచ్ సువ్వాడ శశికళ అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవ సందర్భంగా మామిడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పాఠశాల అవరణలో మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనిషికి జీవనాధారం గాలి ఎలాగో మొక్కలు కూడా అంతేనన్నారు. మొక్కలను మనందరం బాధ్యతగా పెంచుకోవాలని అప్పుడే మంచి వాతావరణంలో మనమంతా జీవిస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీకృష్ణ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న సర్పంచ్ శశికళ

15 రోజుల్లో రీసర్వే పూర్తి :సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలో చేపడుతున్న భూ రీ సర్వేను మరో 15 రోజుల్లో పూర్తి చేస్తామని పాలకొండ సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ తెలిపారు. మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయానికి వచ్చిన సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. మండలంలో 124 రెవెన్యూ గ్రామాలున్నాయని, వీటిలో 17 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీసర్వే కోసం గ్రౌండ్ సర్వేను పూర్తి చేశామని అన్నారు. వీటిలో రెండు రెవెన్యూ గ్రామాల్లో రీ సర్వే పూర్తయిందన్నారు. మరో ఐదు రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే డిఎల్ఆర్ స్టేజిలో ఉందని అన్నారు. మండలంలో 24 గ్రామ సచివాలయాలకు గానూ ప్రస్తుతం 13మంది సర్వేయర్లు మాత్రమే ఉన్నారని, వీరితో మండలంలో భూముల రీసర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మరికొన్ని రెవెన్యూ గ్రామాల్లో గ్రౌండ్ ట్రూత్ సర్వే కూడా పూర్తి చేశామన్నారు. విఆర్‌ఒలు, గ్రామ సచివాలయ సర్వేయర్లతో మండలంలో గౌడుగూడ, దిగువ దేరువాడ, దుడ్డుకల్లు, బీరుపాడు, పాములగీశాడలో యుద్ధ ప్రాతిపదికన రీసర్వే పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఈ మేరకు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఎక్కడైనా రీసర్వేలో లోటుపాట్లు తలెత్తితే సంబంధిత రెవెన్యూ కార్యదర్శి, సచివాలయ సర్వేయర్లను బాధ్యులు చేస్తామని అన్నారు. ఈ మేరకు ప్రభుత్వం నిర్దేశించిన సమయంలో రీసర్వేను పూర్తి చేసి అప్పజెప్పాలని చెప్పారు.

గ్రంథాలయాల అభివృద్ధికి చర్యలు

స్థానిక శాఖా గ్రంథాలయాన్ని సబ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన శాఖ గ్రంథాలయంలో ఉన్న గ్రంథాలయ అధికారినితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని ఈ మేరకు గ్రంథాలయాల్లో అన్ని పుస్తకాలు, న్యూస్ పేపర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో ప్రభుత్వానికి నూతన భవన నిర్మాణానికి సిఫార్సు చేస్తామని అన్నారు. గ్రంథాలయంలో రోజుకు ఎంతమంది చదువు వార్ధులు వస్తున్నారు? ఎన్ని పుస్తకాలు ఇళ్లకు తీసుకు వెళు


సచివాలయ సిబ్బందికి సూచనలు ఇస్తున్న సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్

తున్నారు అని గ్రంథాలయ అధికారాని సుకన్య ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహశీల్దార్ జె.రాములమ్మ, డిటి ఎం.రాజేంద్ర, మండల సర్పంచ్ల సంఘం అధ్యక్షులు బి.గౌరీ శంకర్రావు, విఆర్వో బోడమ్మ, తదితరులు ఉన్నారు.

కెవికె, గ్రంథాలయాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్

కురుపాం : మండలంలోని రస్తాకుంటుబాయిలో గల కృషి విజ్ఞాన కేంద్రాన్ని సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కెవికె ద్వారా గిరిజన రైతులకు ఇస్తున్న శిక్షణా కార్యక్రమాలు, అందుతున్న సేవలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న నర్సరీ పరిశీలించి కెవికె సేవలు గిరిజన రైతులకు మరింత అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. అనంతరం స్థానిక గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ గ్రంథాలయం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు ప్రజలు, విద్యార్థులు, యువత వినియోగించుకుంటున్నారా లేదని అని గ్రంథాలయ ఇన్చార్జి ఎ.శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయ అభివృద్ధికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. సబ్‌కలెక్టర్ వెంట తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్, ఆర్ఐ పిఎల్‌వి ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్వల్పకాలిక కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

ప్రజాశక్తి - సీతంపేట

ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన్ (పిఎంకెవివై 4.0 వారి సారధ్యంలో స్కిల్ హబ్ ఇన్సియాటివ్ కార్యక్రమం ద్వారా స్థానిక ప్రభుత్వ ఐటిఐలో ఉచిత స్వల్పకాలిక శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటిఐ ప్రిన్సిపల్ టివి గిరి ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్‌లో శిక్షణ పొందేవారు టెన్త్ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఫోర్ వీలర్ సర్వీస్ అసిస్టెంట్ శిక్షణ కోరే విద్యార్థులు 8వ తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి అన్నారు. అసిస్టెంట్ ప్లంబర్ జనరల్, సీయింగ్ మిషన్ ఆపరేటర్‌లో శిక్షణ కోరు అభ్యర్థులు కనీసం ఐదో తరగతి ఉత్తీర్ణత సాధించాలన్నారు. అలాగే డోమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ శిక్షణ కోసం టెన్త్ విద్యార్హత ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వారి బయోడేటాతో పాటుగా విద్యార్హత ధ్రువపత్రాలు, 2 పాస్ ఫోటోస్, ఆధార్ కార్డ్‌తో పాటు, బ్యాంక్ అక్కౌంట్ వివరాలతో ప్రభుత్వ ఐటిఐ, సీతంపేటకు హాజరయ్యేందుకు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 6304033963, 9948582309 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

అటవీహక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - సీతంపేట

అటవీహక్కు చట్టంపై మండలంలోని సంకిలిలో వెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో హేబిటేటివ్ రైట్స్, రికార్డ్స్ అఫ్ రైట్స్‌పై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రిసోర్స్ పర్సన్ ఎ.నాగరాజు, చిరంజీవి మాట్లాడుతూ ఈ చటం ద్వారా వ్యక్తిగత, ఉమ్మడి పట్టాలు, అటవీ సంరక్షణ పట్టాలు,హేబిటేటివ్ రైట్స్, అటవీ గ్రామాలు రెవెన్యూ గ్రామాలుగా మార్చడంపై వివరించారు. అలాగే ప్రతి కుటుంబానికి పదెకరాల వరకు సాగు చేసిన భూమికి పట్టా పొందవచ్చని, పట్టా యజమాని మరణిస్తే పట్టా మార్పిడి చేయవచ్చునని, ఈ పట్టాల ద్వారా ప్రభుత్వ పథకాలు పొందవచ్చని తెలిపారు. గ్రామ సభల ద్వారా సమస్యలు పరిష్కరించుకోవచ్చని, గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలకు అడ్డురాకుండా రోడ్లు, ఇళ్లు, భవన నిర్మాణాల కోసం అటవీ పట్టాలు పొందవచ్చని వివరించారు. ఈ శిక్షణలో మండలంలోని దిగువసంకిలి, ఎగువ సంకిలి, సంకిలి, బంజారుగూడ 4 గ్రామాలకు చెందిన గిరిజనులు, వెలుగు అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



సాలూరు మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

ప్రభుత్వ ఉద్యోగుల 'వర్క్ టు రూల్'నిరసన

ప్రజాశక్తి - సాలూరు

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అమరావతి జెఎసి పిలుపు మేరకు మంగళవారం స్థానిక మున్సిపల్, ఆర్టీసీ ఉద్యోగులు వర్క్ టు రూల్ నిబంధన ప్రకారం సాయంత్రం ఐదు గంటలకే విధులు ముగించుకొని కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. జెఎసి జిల్లా నాయకులు డిజి ప్రసాద్, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిపో నాయకులు ఎంఎస్ నారాయణ, మున్సిపల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు షేక్ మహమ్మద్, నాయకులు పివిటీ రాఘవాచార్యులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు.

పాలకొండ : రాష్ట్రకమిటీ పిలుపు మేరకు మంగళవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట రెవెన్యూ ఉద్యోగులు నిరసన తెలిపారు. పనిభారం తగ్గించాలని, పిఆర్‌సి అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డిఎ బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సోముశ్వరరావు, రెవెన్యూ ఉద్యోగుల సంఘం డివిజన్ సహాధ్యక్షులు బి.బుచ్చియ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో మహిళలు అభివృద్ధి చెందాలి

ప్రజాశక్తి - కురుపాం

మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, అందుకు ప్రభుత్వం మహిళలకే సంక్షేమ పథకాలు అందజేస్తుందని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. మండలంలోని బియ్యాల వలస సచివాలయ పరిధిలో గల దండుసురలో వైకెపి ఎపిఎం ఇ.వెంకట్ కిషోర్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ ఆసరా మూడో విడతకు సంబంధించి మహిళా సంఘాల సభ్యులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైఎస్ఆర్ ఆసరా డ్వాక్రా సంఘాల రుణ మాఫీ పథకమని, మొదట, రెండో విడత మహిళా సంఘాలు ఖాతాలో జమయ్యాయని, మూడో విడత ఈనెల 25న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి లాంఛనంగా ప్రారంభిస్తారని, తెలిపారు. కావున ఈ పథకాన్ని అందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు జి.సుజాత, గుమ్మడిగూడ సర్పంచ్ శెట్టి సురేష్, మేజర్ పంచాయతీ సర్పంచ్ జి.సుజాత,


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి పద్మావతి

సిసిలు నాగేశ్వరరావు, తిరుపతి, లక్ష్మణ్, విఒఎలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ఆధార్ నమోదు తనిఖీ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక సీతంపేట సచివాలయంలో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంప్ కార్యాలయాన్ని మంగళవారం డిఎల్‌డిఒ వివి గోపాలకృష్ణ తనిఖీ చేపట్టారు. ప్రజలకు సకాలంలో ఆధార్ అప్డేట్ చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ ప్రక్రియ మరింత వేగంగా చేయాలన్నారు. ఆధార్ క్యాంపు ఇక్కడ ఉన్నట్లు ప్రజలకు తెలియజేయాలన్నారు ప్రతి ఒక్కరూ ఆధార్ అప్డేట్ చేసుకోవాలన్నారు. ఆయనతో పాటు ఎంపిడిఒ కె.గీతాంజలి, కార్యదర్శి బి.సుదర్శనరావు, సచివాల సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తులు అరెస్టు

ప్రజాశక్తి - కొమరాడ

మండలంలోని గుణానపురంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తులను అరెస్టు చేసినట్లు కొమరాడ ఎస్సై జగదీష్ నాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. గుణానపురం గ్రామ చివరలో మద్యం అమ్ముతున్నట్లు తెలిసిందన్నారు. సమాచారం తెలిసిన వెంటనే తన సిబ్బందితో అమ్మకాలు చేస్తున్న వారిపై దాడులు చేశామన్నారు. గుణానపురానికి చెందిన ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి 158 మద్యం బాటిల్ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుకున్న మద్యం బాటిళ్ల విలువ సుమారు రూ.23,610 ఉంటుందని తెలిపారు. ఇద్దరు వ్యక్తులను, మద్యం సీసాలను అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఎన్ఆర్‌సి కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక ఎన్ఆర్‌సి, తలసేమియా డేకేర్ కేంద్రాలను మంగళవారం జిల్లా ఇమ్మునైజేషన్ అధికారి (డిఐఒ) డాక్టర్ టి.జగన్మోహనరావు సందర్శించారు. ఈకేంద్రంలో పిల్లలకు రోజువారీ ఇస్తున్న పౌష్టికాహార మెనూ, మందులు, బరువు రికార్డులను, పిల్లల ఆరోగ్య స్థితిని ఆయన పరిశీలించి, వారి తల్లులతో మాట్లాడి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం ఆయన తలసేమియా డేకేర్ సెంటర్‌ను సందర్శించి అక్కడ వైద్య సేవలు పొందుతున్న వారి రికార్డులను పరిశీలించారు. ముఖ్యంగా సికిల్‌సెల్ ఎనీమియా, తలసేమియాగా నమోదైన వారికి ఇస్తున్న మందులు, బ్లడ్ ట్రాన్స్ ఫ్యుజన్ వివరాలను పరిశీలించారు. వీరికి ప్రతి నెలా ఆరోగ్య పర్యవేక్షణకు సంబందించిన ట్రీట్మెంట్ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్


తలసేమియాతో బాధపడుతున్న విద్యార్థిని పరిశీలిస్తున్న డిఐఒ జగన్మోహన్

జయగౌడ్ , న్యూట్రిషన్ కౌన్సిలర్ జి.జ్యోతి , వైద్య సిబ్బంది ఉన్నారు..

సబ్‌స్టెంట్ కృష్ణ ఆకస్మిక మృతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం



మండలంలోని సవర కోటపాడు హార్టికల్చర్ సబ్‌స్టెంట్ కోట కృష్ణ సాలూరు మండలం బాగువలసలో తన ఇంటి వద్ద గుండెపోటుతో మృతి చెందారు. కృష్ణ మంగళవారం విధులకు హాజరై అనంతరం తన ఇంటికి వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో స్నానం కోసం బాత్రూంకి వెళ్లారు. ఒక్కసారిగా గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలి పోయారు. స్పృహ కోల్పోయిన ఆయన్ను ఆసుపత్రికి తీసుకువెళ్లగా వైద్యుల పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు. కృష్ణ మంచి ఉద్యోగిగా, వ్యక్తిత్వం ఉన్న మనిషిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన మృతి పట్ల ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలక దేవానంద్, చెముడు గూడ తోటి ఉద్యోగులు, స్నేహితులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

తస్మాత్ జాగ్రత్త...

కూలిన బ్రిడ్జితో పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని మారుమూల గిరిజన ప్రాంతమైన పివి ఈతమానుగూడ, నెల్లిగండి సమీపంలో రహదారి నాణ్యత లేకపోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు సగం రోడ్డుకు కోతకు గురైంది. దీంతో ఈ వాహనం గుండా వెళ్లాలంటే ప్రయాణికులు భయాందోళన చెందుతారు. మరోపక్క పివి ఈతమానుగూడ, బంజారుగూడ రహదారి బ్రిడ్జి కూలి పోవడానికి సిద్ధమైంది. దీంతో ఈ గ్రామ సర్పంచ్ వీరన్నతో పాటు గ్రామస్తులు వేసి ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి బ్రిడ్జి కింద రాళ్లు వేశారు. అయితే అక్కడే జగనన్న కాలనీ ఉంది. ఇక్కడ ఇళ్లు నిర్మిస్తే ఇసుక, సిమెంట్, ఐరన్ ఈ బ్రిడ్జి మీదుగానే వెళ్లాలి. ఎక్కువ బరువు ఉన్న వాహనాలు బ్రిడ్జిమీదుగా వెళ్తే కూలిపోతుందని గ్రామస్తులు వాపోతున్నారు. అంతేకాక ఈ బ్రిడ్జి 10 గ్రామాల ప్రజలకు ఉపయోగపడుతుంది.


గొయ్యి పడ్డ బ్రిడ్జి

ఇప్పటికైనా అధికారులు స్పందించి బ్రిడ్జి మరమ్మతులు చేపట్టాలని ఈ గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

లారీ ఢీకొని మెకానిక్ మృతి

కొత్తవలస : మండలంలోని కంటకాపల్లి గ్రామానికి చెందిన సేనాపతి గణేష్ (36) లారీ ఢీకొని అక్కడకక్కడే మృతి చెందిన సంఘటన మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. గణేష్ ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే తన షాపుకి బైకుపై వెళుతుండగా, కొత్తవలస సమీపంలో లారీ వెనుక నుంచి ఢీకొని అక్కడికి అక్కడే మృతి చెందాడు. గణేష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నారు. పోలీసులు లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్.కోట తరలించారు. కొత్తవలస పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడునాళ్ల ముచ్చటగా సెంటర్ లైటింగ్

ప్రజాశక్తి - సీతంపేట

మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పెట్టాలని అప్పటి ఐటిడిఎ పిఒ సాయికాంత్ వర్మ దృఢ సంకల్పంతో చుట్టుపక్కల డివైడర్లు వేసి సెంట్రల్ లైటింగ్ హుటాహుటిన ఏర్పాటు చేశారు. స్థానిక సంత మార్కెట్ నుంచి వైటిసి వరకు ఏర్పాటు చేశారు. ఆ లైటింగ్‌తో పట్టణ వాతావరణంలో కనిపించేది. ప్రస్తుతం సెంట్రల్ లైటింగ్ లేకపోవడంతో చీకటిగా మారింది. ఈ ప్రాంతంలో పోస్ట్ మెట్రిక్ వసతి గహం ఐటిఐ ఉన్నాయి. పోస్ట్ మెట్రిక్ బాలికల వసతి గృహం ఉన్నప్పటికీ లైటింగ్ లేకపోవడంతో అక్కడ విద్యార్థులు అత్యవసర సమయంలో బయటికి చీకట్లోనే వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. మరోపక్క సంబంధిత కార్యాలయాలు విద్యుత్ బిల్లులు చెల్లించలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ సెంట్రల్ లైటింగ్ పోస్ట్ మెట్రిక్ వసతి గృహం వద్ద వెలిగించాలని విద్యార్థుల


లైట్లు మరమ్మతులు కావడంతో అంధకారంలో ఉన్న సీతంపేట

తల్లిదండ్రులు కోరుతున్నారు.

వడ్డీ మాఫీతో శరవేగంగా పన్నుల వసూళ్లు

పార్వతీపురం టౌన్ : మున్సిపల్ పరిధిలో గల నివాస గృహాలు, వాణిజ్య సముదాయాలు, ఖాళీస్థలాల పన్నుల పాత బకాయిలు పేరుకుపోయిన ఉన్న యజమానులకు ఈనెల 31లోగా పన్నులు చెల్లిస్తే వడ్డీ మాఫీ చేయడం జరుగుతుంది రాష్ట్ర ప్రభుత్వము ప్రకటించిన నేపథ్యంలో అనేక ఏళ్లుగా బకాయిలు ఉన్న యజమానులు వడ్డీ లేకుండా పన్ను లు కట్టేందుకు చొరవ చూపించారు. దీంతో మంగళవారం పలువురు బకాయిలు ఉన్న యజమానుల వద్దకు మున్సిపల్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ పి.నారాయణ రావు, సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు నేరుగా వెళ్లి నగదు, చెక్కుల రూపంలో పన్నులు కట్టించు కున్నారు.


పన్నులను వసూలు చేస్తున్న సచివాలయ సిబ్బంది